ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 30 అక్టోబరు 2025

నేడు తెరుచుకోనున్న పాఠశాలలు

సాలూరు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలలు గురువారం నుంచి తెరుచుకోనున్నాయి. తుఫాన్ నేపథ్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు సెలవులు ప్రకటించారు. అయితే బుధవారం వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో నేటి నుంచి పాఠశాలలు యథావిధిగా పని చేయనున్నాయని సాలూరు, పాచిపెంట ఎంఈవోలు వెంకటరావు, సతీష్‌కుమార్ తెలిపారు. వాస్తవంగా బడులకు వరుసగా ఐదు రోజులు సెలవులు వచ్చాయి. నాగుల చవితి సందర్భంగా ఈ నెల 25న పలు మండలాల్లో లోకల్ హాలీడే ప్రకటించారు. 26న ఆదివారం కాగా, ఆ తర్వాత తుఫాన్ సెలవులు ప్రకటించారు.



పాలకొండ: నీట మునిగిన వరి పంట

ముంచెత్తిన మొంథా!

మక్కువ రూరల్: అడారిగెడ్డపై వరద ప్రవాహం

- 904 హెక్టార్లలో పంటలకు నష్టం
- ఉధృతంగా గెడ్డలు, వాగులు
- కాజ్‌వేలపై నుంచి వరద ప్రవాహం
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- తీరం దాటిన తుఫాన్.. ఊపిరి పీల్చుకున్న జిల్లావాసులు



పార్వతీపురం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ముప్పు తొలగింది. వాతావరణం తెరిపిచ్చింది. దీంతో జిల్లావాసులు ఊపిరి పీల్చుకున్నారు. తుఫాన్ తీరం దాటిన సమయంలో మన్యంలో బుధవారం వర్షం కురవగా.. సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. అయితే ఎగువ ప్రాంతం ఒడిశా రాష్ట్రంలోనూ వానలు కురవడంతో జిల్లాలో వాగులు, వంకలు, గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జలాశయాలకు వరద పోటెత్తుతోంది. చాలాచోట్ల వరి, పత్తి పంటలు ముంపునకు గురయ్యాయి. స్వల్ప గాలులకు వరి చేలు నేలవాలింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి..

తుఫాన్ కారణంగా జిల్లాలో 29 ఇళ్లు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని పది మండలాల్లో సుమారు 904 హెక్టార్లలో పంటలు నీట మునిగినట్టు జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. సుమారు 50 ఎకరాల్లో ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యా యని వెల్లడించారు. అధి కారులు క్షేత్రస్థాయిలో పరిశీ లించి నివేదికలు అందించాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. 33 శాతం కన్నా ఎక్కువ నష్టం వాటిల్లితేనే పరి గణనలోనికి తీసుకోవాలని తెలిపారు. ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. పంట నష్టం అంచనా లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జేసీ సూచించారు. ● జిల్లా లోని పలు గ్రామాల్లో సుమారు 38 విద్యుత్ స్తంభాలు నేలకూలగా.. విద్యుత్ సబ్ స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. ● 78 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 16.7 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు.

నిలిచిన రాకపోకలు.. ముంపులో పంటలు..

● మక్కువ రూరల్: వీఆర్ఎస్ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంతో గోముఖినది పరిధిలోని కవిరిపల్లి వద్ద కాజ్‌వే నీట మునిగింది. అదేవిధంగా దుగ్గేరు సమీపంలోని అడారి గెడ్డపై వరద ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సాలూరు నుంచి మక్కువ, దుగ్గేరు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను కూడా నిలిపేశారు. కాజ్‌వేల గుండా ఎవరూ రాకపోకలు సాగించకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కాగా మక్కువ మండలంలో పత్తి, అరటి, వరి పంటలు దెబ్బతిన్నాయి. ● భామిని: చీకటితోట గెడ్డ గట్టుకు గండి పడడంతో లివిరి రహదారిపై వరద నీరు చేరింది. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తమై రాకపోకలు నిలుపుదల చేశారు. లివిరి రోడ్డు మీద నుంచి కనపాల చెరువు మీదుగా పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా వంశధార నదిలో 10 వేల క్యూసెక్కుల వరద చేరగా.. కాలువల గుండా రెండు వేల క్యూసెక్కులను విడిచిపెట్టారు. మండలంలో 330 ఎకరాల్లో వరి,

(మిగతా 8వ పేజీలో...)

వర్షపాతం నమోదు ఇలా..

బెలగాం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. సీతంపేటలో 16.8 మిల్లీమీటర్లు, పాచిపెంట 12.2, సాలూరు 3.4, బలిజిపేట 6.2, పాలకొండ 2.8, భామిని 18.8, వీరఘట్టం 7.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. పార్వతీపురంలో 6.6, సీతానగరం 16.6, మక్కువ 11.2, కురుపాం 15.9, గుమ్మలక్ష్మీపురం 2.8, జియ్యమ్మవలస 15.4, కొమరాడలో 13.6 మిల్లీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఆర్టీసీకి రూ.30 లక్షల నష్టం

పాలకొండ: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పాలకొండ, పార్వతీపురం, సాలూరు డిపోల నుంచి 27, 28 తేదీల్లో విజయవాడ, రాజమండ్రి, రావులపాలెంకు వెళ్లే 11 సర్వీసులను నిలిపేశారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు వెళ్లే 50 బస్సులను తాత్కాలికంగా రద్దు చేశారు. దీంతో ఆ రెండు రోజుల్లో ఆర్టీసీకి రూ.30 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు జిల్లా అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.



సీతంపేట రూరల్: లాడలో దెబ్బతిన్న గిరిజనుల ఇళ్లు



జియ్యమ్మవలస: రాళ్లగెడ్డ వద్ద రాకపోకలు నిషేధించిన అధికారులు



భామిని: ముంపులో లివిరి పంట పొలాలు

సమర్థంగా ఎదుర్కొన్నాం!

- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎవరూ ఇబ్బంది పడకూడదు
- మంత్రి సంధ్యారాణి



మామిడిపల్లిలో సువర్ణముఖి నదిని పరిశీలిస్తున్న మంత్రి

సాలూరు/సాలూరు రూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సూచనలు, జిల్లా యంత్రాంగం సహకారంతో ఎటువంటి నష్టం లేకుండా తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొన్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. బుధవారం సాలూరు తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. 'వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాతే పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులను తిరిగి ఇళ్లకు పంపించాలి. వారికి ఆహార పదార్థాలు, తాగునీరు అందించాలి. గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకూడదు. వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి నష్టపోయిన పంటలను పరిశీలించాలి. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందనే విషయాన్ని అన్నదాతలకు తెలియజేయాలి. సాలూరు మార్కెట్ యార్డులో పత్తిని కొనుగోలు చేస్తాం. సాలూరులోని ఓ మిల్లులో రైతుల పంటలను నిల్వ చేసుకోవచ్చు. ఖాళీగా ఉన్న గోదాములను అందుబాటులోకి తేస్తాం. వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. లబ్ధిదారులు అడిగితే ముందస్తుగా బియ్యం అందించాలి.' అని మంత్రి తెలిపారు. నిధుల కోసం తమను సంప్రదించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆమె మామిడిపల్లిలో పర్యటించారు. ఆ గ్రామంలో పీహెచ్‌సీ, సువర్ణముఖి నది ప్రవాహాన్ని పరిశీలించారు. 'వెంగళరాయ సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడం వల్ల మామి డిపల్లి పీహెచ్‌సీతో సహా పలు లోతట్టు ప్రాంతాలకు ముంపు ముప్పు తప్పింది. పీహెచ్‌సీలో ఉన్న వైద్య పరికరాలను పక్కనే ఉన్న వైద్యుల క్వార్టర్స్‌కు తరలించాం. రోగులు ఇబ్బంది పడకుండా వైద్యాధికారులు సేవలు అందిస్తున్నారు. జిల్లాలో మహిళా పోలీసులకు వాకీటాకీలు ఇచ్చాం. వాటి ద్వారా ఏ సమస్య అయినా ఉన్నతాధికారులకు చెప్పొచ్చు. తుఫాన్ బాధితులు 1912, 100, 101 ట్రోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి సాయం పొందొచ్చు. వరద ఉధృతి నేపథ్యంలో కాజ్‌వేలపై రాకపోకలు నిషేధించగా.. ఆయా గ్రామస్థులకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలి.' అని మంత్రి చెప్పారు.

తుఫాన్ నష్టాలపై దృష్టి పెట్టండి

- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- యంత్రాంగం అప్రమత్తతపై సీఎం హర్షం
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నష్టాలపై ప్రత్యేక దృష్టిసారించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హర్షం వ్యక్తం చేశారని తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. 'స్థానిక ప్రజలు, యువత సహకారం, అధికారుల సమన్వయంతో సమర్థంగా మొంథా తుఫాన్‌ను ఎదుర్కోగలిగాం. ప్రస్తుతం పల్లె, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి సారించాలి. కూలిన ఇళ్లను గుర్తించాలి. పశు, వ్యవసాయ నష్టాలను అంచనా వేయాలి. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలో తరగతులు నిర్వహించరాదు. ఆసుపత్రులకు తరలించిన గర్భిణులను మరికొన్ని రోజులు అక్కడే ఉంచాలి. చెరువులకు గండ్లు పడే అవకాశం ఉన్నందున వాటిని పర్యవేక్షించాలి. ఫుడ్‌సేఫ్టీ అధికారులు షాపులపై దాడులు చేయాలి.' అని కలెక్టర్ తెలిపారు. జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రిలీఫ్ కేంద్రాల్లో ఉన్న వారికి కిట్లు అందించాలన్నారు.



వంతరాం గ్రామంలో పరిస్థితిపై ఆరా తీస్తున్న కలెక్టర్

వంతరాంలో పర్యటన

సీతానగరం: బలిజిపేట మండలం వంతరాంలో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీని సందర్శించగా.. రెండు రోజుల పాటు కరెంట్ లేదని అక్కడి వారు తెలిపారు. దీంతో కలెక్టర్ ట్రాన్స్‌కో సిబ్బందితో మాట్లాడి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఎలక్ట్రికల్ ఏఈని సస్పెండ్ చేశారు. ఆ తర్వాత నూకలవాడ పునరావాస కేంద్రానికి చేరుకుని తుఫాన్ బాధితులతో మాట్లాడారు. అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వసతి గృహ, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ .. తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో వచ్చే మార్పులు దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏ ఒక్కరూ అనారోగ్యానికి గురికారాదని తెలిపారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించి వైద్యసేవలు అందించాలని సూచించారు.

ఉచితంగా నిత్యావసర సరుకులు

తుఫాన్ ప్రభావిత కుటుంబాలకు ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు జేసీ తెలిపారు. 25 కిలోల బియ్యం, మత్స్యకారులకు 50 కిలోల రైస్, లీటర్ నూనె, కిలో చొప్పున ఉల్లిపాయలు, పప్పు, బంగాళాదుంపలు, చక్కెర అందిస్తామన్నారు.

అన్నదాతకు తీరని కష్టం 6లో

- మొంథా తుఫాన్‌తో నష్టపోయిన వైనం ● నీట మునిగిన పంటలు

పంట నష్టాల పరిశీలన 8లో

మళ్లీ వచ్చేశాయ్! 6లో

- గవరమ్మపేట-వెంకటరాజపురం మధ్య ఏనుగుల సంచారం

మెరుగైన వైద్యసేవలు అందించాలి: డీఎంహెచ్‌వో

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా పీహెచ్‌సీలకు రోగుల తాకిడి పెరగనున్న నేపథ్యంలో అందరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. బుధవారం దుడ్డుకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు. పీహెచ్‌సీలో జ్వరాలతో చికిత్స పొందుతున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థిని పరామర్శించారు. అనంతరం దుడ్డుకల్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను పరిశీలించారు. అనా రోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులు ఎవరైనా ఉన్నారా? అని ఆరా తీశారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.



విద్యార్థిని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో

రైతులు జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్ పాల్

బెలగాం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తర్వాత ఖరీఫ్ వరి రైతులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్ తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. 'పొలంలో నీరు నిలిచి ఉంటే వెంటనే తొలగించాలి. గింజలు రంగు మార కుండా, మాగుడు, మానిపండు తెగుళ్ల నివారణకు ఎకరాకు 200 మిల్లీ లీటర్ల చొప్పున ప్రోపికోనాజోల్ పిచికారీ చేయాలి. మొల కలు కనబడితే 5శాతం ఉప్పు ద్రావణం (50 గ్రాముల స్ఫటిక ఉప్పు) స్ప్రే చేయాలి. ఎండాకు తెగులు ఆశిస్తే.. ప్లాంటోమైసిస్ ఒక మిల్లీ లీటర్, కాపర్ ఆక్సీ క్లోరైడ్ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నీరు తగ్గిన తర్వాత హెక్సకొనజోల్ 2 మిల్లీ లీటర్లు లీటర్ నీటిలో కలిపి స్ప్రే చేయాలి.' అని వెల్లడించారు.

ఏఎంసీలకు పూర్వ వైభవం వచ్చేనా?

- మార్కెట్ యార్డుల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ఆదేశాలు
- రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- గోడౌన్లు, కోల్ట్‌స్టోరేజ్ ఏర్పాటుపై దృష్టిసారించాలని విన్నపం

పార్వతీపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లకు మంచి రోజులు రానున్నాయా? రైతులకు విశేష సేవలు అందించనున్నాయా? అంటే అవుననే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏఎంసీల ఆధునికీకరణపై కీలక ప్రకటన చేయడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా మార్కెట్ యార్డులను తీర్చిదిద్దాలని, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. దీంతో ఏఎంసీలకు పూర్వవైభవం రానుందని జిల్లా వాసులు భావిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డులో సివిల్ సప్లైస్ శాఖ గోడౌన్, జీడి ప్రాసెసింగ్ యూనిట్ తదితర వాటిని నిర్వహిస్తున్నారు. ఇక ప్రతి గురువారం ఈ ప్రాంగణంలో సంత జరుగుతుంది. అయితే మార్కెట్ యార్డులో పంటలను నిల్వ చేసేందుకు అవసరమైన గోడౌన్లతో పాటు కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని కొన్నాళ్లుగా ఈ ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయినా ఆ దిశగా ఎటువంటి చర్యల్లేవు. మార్కెట్ యార్డుల కమిటీ ఛైర్మన్లు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారు. రైతులకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కురుపాం మార్కెట్ యార్డు నియోజక వర్గస్థాయి మట్టి నమూనా పరీక్షలకే పరిమితమైంది. ఇక్కడ గోడౌన్లు లేవు. ఈ ప్రాంతంలో చింతపండు నిల్వకు కోల్డ్‌స్టోరేజ్ అవసరం ఎంతో ఉన్నప్పటికీ అటువైపుగా అధికారులు, పాలకులు దృష్టి సారించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన



పాలకొండ మార్కెట్ యార్డు



సాలూరు ఏఎంసీ

(మిగతా 8వ పేజీలో...)

అన్నదాతకు తీరని కష్టం

- మొంథా తుఫాన్‌తో నష్టపోయిన వైనం
- నీట మునిగిన పంటలు

మొంథా తుఫాన్ తాకిడికి ఉమ్మడి జిల్లాలో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. మరికొద్ది రోజుల్లో చేతికి అంది వస్తుందనుకున్న వరి పంట నీట మునిగింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చెరువులు ఎక్కడ ఉన్నాయో.. పొలాలు ఏవో గుర్తు పట్టడం కష్టమంటే అతిశయోక్తి కాదు. అనేక చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గెడ్డలు పొంగి.. పొలాల మీద పడ్డాయి. నీట మునిగిన పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



గజపతినగరం: కొత్తబగ్గాంలో దెబ్బతిన్న పంటను చూపిస్తున్న రైతు



మెరకముడిదాం: నీట మునిగిన వరి పంట



విజయనగరం: వర్షంలో ప్రజల ఇక్కట్లు



సంతకవిటి: సిరిపురం రెల్లిగెడ్డ వద్ద రోడ్డుపై వరద నీరు



ఎస్.కోట రూరల్: విశాఖ-అరుకు రోడ్డుపై చెట్టును తొలగిస్తున్న సీఐ నారాయణమూర్తి, పోలీసులు



సాలూరు రూరల్: మామిడిపల్లి పీహెచ్‌సీ సామగ్రిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న సిబ్బంది



కురుపాం రూరల్: కోటకొండ ఘాట్ రోడ్డులో బండరాయిని తొలగిస్తున్న సచివాలయ సిబ్బంది



ఎస్.కోట: శృంగవరపుకోట రెవెన్యూ పరిధిలో నీట మునిగిన వరి పంట



భోగాపురం: కూలిన పెంకుటిల్లు



సాలూరు రూరల్: దండిగాం కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు



పూసపాటిరేగ మండలం రెల్లివలసలో...



విజయనగరం: కుమిలి రోడ్డులోని కాలువలో పిల్లలు ఇలా..



భోగాపురం: జాతీయ రహదారిపై వరద నీరు



భోగాపురం: కెరటాల ఉధృతికి ఇసుకలో కూరుకుపోయిన తెప్ప



ఎస్.కోట రూరల్: అలుగుబిల్లి-ఎస్.కోట రోడ్డు వంతెనపై వరద నీరు



రేగిడి: అంబాడలో నీట మునిగిన వరిని చూపిస్తున్న రైతులు

ఉధృతంగా ప్రవహిస్తున్న వేగావతి



వేగావతి నదీ ప్రవాహం

బొబ్బిలి రూరల్ /బొబ్బిలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వేగావతి నది ఉగ్రరూపం దాల్చింది. మొంథా తుఫాను కారణంగా పెద్దగెడ్డ గేట్లు ఎత్తి 12 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశామని ఇరిగేషన్ ఎస్ఈ ఆర్.అప్పారావు తెలిపారు. దీంతో నది ఉధృతి పెరిగింది. సర్కిల్ పరిధిలో ఎక్కడా పంట కాలువలకు, చెరువులకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని తెలిపారు. నదీ పరీవాహక ప్రాంతానికి జనం వెళ్లకుండా అధికారులు పహారా కాస్తున్నారు. పారాది వద్ద వేగావతి నది ప్రవాహాన్ని ఆర్ అండ్ బి, నీటి పారుదల అధికారులు బుధవారం పరిశీలించారు. ప్రవాహ తీవ్రత పెరగడంతో పరీవాహక గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఈ అప్పారావు

నాగావళి నదికి భారీగా వరద

గరుగుబిల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదికి బుధవారం వరద ప్రవాహం అధికమైంది. మొంథా తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నదిలో వరద ప్రవాహం అధికంగా చేరుతోంది. ఉదయం 7 గంటల ప్రాంతంలో పైప్రాంతాల నుంచి 19 వేల క్యూసెక్కులకు పైగా వరద చేరింది. 8 గంటలకు 14,500 క్యూసెక్కులు, 9 గంటలకు తగ్గుముఖం పడుతూ 5,500 క్యూసెక్కులకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టు జేఈ బి.కిషోర్‌కుమార్, ఆపరేటర్ కెంగువ రామకృష్ణలు వరద ప్రవాహాన్ని అంచనా వేశారు. హెచ్చు తగ్గులతో వరద చేరడంతో స్పిల్‌వే గేట్ల నుంచి 6 వేల క్యూసెక్కుల మేర దిగువ ప్రాంతాలకు మళ్లించారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.74 మీటర్ల నిల్వ ఉంది. వర్షాలు అధికంగా కురవడంతో ప్రధాన కాలువల నుంచి సాగునీరు నిలుపుదల చేసినట్టు అధికారులు తెలిపారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే మరింతగా వరద ప్రవాహం పెరిగే పరిస్థితి ఉందని వారు తెలిపారు.



నాగావళిలో వరద ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు



గవరమ్మపేట సమీపంలో సంచరిస్తున్న గజరాజులు

మళ్లీ వచ్చేశాయ్!

- గవరమ్మపేట-వెంకటరాజపురం మధ్య ఏనుగుల సంచారం

జియ్యమ్మవలస, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గజరాజులు మళ్లీ మండలానికి వచ్చేశాయి. సుమారు రెండు నెలల తరువాత బుధవారం గవరమ్మపేట-వెంకటరాజపురం గ్రామాల మధ్య కనిపించాయి. ఏనుగుల వల్ల అరటి, చెరకు, వరి పంటలకు తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం సాయంత్రానికి గవరమ్మపేట గ్రామ సమీపంలోని అరటి తోటలకు గజరాజులు చేరాయి. ప్రస్తుతం గవరమ్మపేట, ఎరుకులపేట, చింతలబెలగాం, వెంకటరాజపురం గ్రామాల్లో వరి పంటకు కొంత నష్టం కలిగిందని అధికారులు చెబుతున్నారు. పార్వతీపురం నుంచి కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి వెళ్లే ప్రధాన రహదారికి సమీపంలో ఏనుగులు ఉండటం వల్ల వాహన చోదకులు, మండల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీటిని త్వరగా ఇక్కడి నుంచి తరలించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు.



గోముఖి స్పిల్‌వే రెగ్యులేటర్ ద్వారా నీటిని విడిచిపెట్టిన దృశ్యం

వెంగళరాయ సాగర్‌కు జలకళ

మక్కువ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా వెంగళరాయ సాగర్ జలాశయం వరదనీటితో పూర్తిగా నిండిపోయింది. ఒడిశా కొండ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. సువర్ణముఖి క్లస్టర్ స్పిల్ వే రెగ్యులేటర్ గేటు వద్ద 161 మీటర్ల ఎత్తు వరకు నీటి నిల్వ సామర్థ్యం ఉంది. బుధవారం 159 మీటర్ల ఎత్తు దాటి... 3వేల క్యూసెక్కులకు పైగా జలాశయంలోకి చేరుతోంది. దీంతో అధికారులు అప్రమత్తమై బుధవారం రాత్రి 3వేల క్యూసెక్కుల నీటిని సువర్ణముఖి నదిలోకి విడుదల చేశారు. గోముఖి స్పిల్‌వే రెగ్యులేటర్ ద్వారా 2100 క్యూసెక్కుల నీటిని గోముఖి నదిలోకి విడుదల చేశారు. వరదల కారణంగా వచ్చిన నీటిని వచ్చినట్టుగానే నదిలోకి విడిచి పెడుతున్నామని ప్రాజెక్టు డీఈఈ సురేష్ తెలిపారు.



సువర్ణముఖి నదిలోకి నీటిని విడిచిపెట్టిన దృశ్యం


వేపాడ: మారికలో నేలమట్టమైన వరిపంట


వంగర: సీతారాంపురంలో..


భోగాపురం: శ్రీరాంనగర్ కాలనీకి వెళ్లే రహదారిని పరిశీలిస్తున్న నాగమాధవి, బంగార్రాజు


విజయనగరం రూరల్: నల్లచెరువు వద్ద తుఫాన్ బాధితులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు


ఎస్.కోట రూరల్: కాపుసోంపురం పునరావాస కేంద్రంలో మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


గరివిడి: కాపుశంభంలో పంట పొలంలో బాధిత రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు


విజయనగరం రూరల్: తుఫాన్ ప్రభావిత ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ నగర అధ్యక్షుడు గంటా రవి


నెల్లిమర్ల: తుమ్మలపేట గెడ్డ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

అన్నదాత అతలాకుతలం

- నేలకొరిగిన వరి, వాణిజ్య పంటలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు
- పంట నష్టాల అంచనాల్లో అధికారుల తలమునకలు

జిల్లాలో మొంథా తుఫాన్ వల్ల అన్నదాతలు అతలాకుతలమయ్యారు. రెండురోజులపాటు ఈదురుగాలులతో కురిసిన వర్షాలనకు వరి, వాణిజ్య పంటలు నేలకొరిగాయి. ఈ నేపథ్యంలో పంటనష్టాలు అంచనా వేయడంలో అధికారులు తలమునకలయ్యారు.

●గరివిడి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. బుధవారం కాపుసంభంలో నేలకొరిగిన వరిపంటను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ టీడీపీ నేతలు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

●చీపురుపల్లి,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):సీఎం చంద్రబాబు సమర్థత, ముందుచూపు వల్లనే మొంథా తుఫాన్ ప్రమాదం నుంచి రాష్ట్ర ప్రజలు గట్టెక్కారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. చీపురుపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుర్ల కేజీబీవీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఫ్యాన్ వద్దపొగలు వచ్చాయని, ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. కాగా మండలంలో 50 ఎకరాల్లో వరి నేలకొరిగిందని ఏవో సూర్య కుమారి తెలిపారు. పీకే పాలవలస, మెట్టపల్లి, గొల్లలపాలేం, జి.ములగాం, చిననడిపల్లి, ఇటకర్లపల్లి, రామలింగపురంల్లో పంట నేలకొరిగిందన్నారు.

●ఎస్.కోట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 'మీరంతా మా కుటుంబసభ్యులు..మీకు కష్టం వస్తే మేము ఎల్లవేళల మేముంటాం' అని తుఫాన్ బాధితులకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి భరోసా ఇచ్చారు. బుధవారం మెట్టపాలెం, మూలబొడ్డవర, కాపుసోంపురంల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిళలకు చీరలు, బాధితులకు పాలు, రొట్టెలు పంపిణీచేశారు. కాగా జేసీ సేతుమాదవన్‌తో కలిసి పలుగ్రామాల్లో జిల్లా ప్రత్యేకాధికారి రవిసుభాష్ ముంపు బారిన పడిన పంటలు పరిశీలించారు. కాగా వరద ప్రభావితప్రాంతాల్లో ఎమ్మెల్సీ రఘురాజు, టూరిజం కార్పొరేషన్ డైరక్టర్ సుధారాణి పర్యటించారు.వీరి వెంట నాయకులు వసి వెంకటరావు, ఒబ్బిన సతీష్ ఉన్నారు.

●లక్కవరపుకోట,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):ఎల్.కోట బీసీ కాలనీలో నీరు నిల్వ ఉన్న ప్రదేశాన్ని ఎమ్మెల్యే లలితకుమారి పరిశీలించారు. యంత్రాలతో కాలువ తవ్వి నీరుపోయే మార్గాన్ని ఏర్పాటుచేశారు. కాగా మండలంలో తుఫాన్ వల్ల 99 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఏవో హరికృష్ణ తెలిపారు. 168 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. 16 రెవెన్యూ గ్రామాల్లో 68 ఎకరాల్లో పంట నేలకొరిగిందని, 12 రెవెన్యూ గ్రామాల్లో 32 ఎకరాల్లో పంట నీట మునిగిపోయిందని తెలిపారు.

●జామి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భీమసింగి-కొత్తవలస ప్రధాన రహదారిపై నీరు ప్రవహించడంతోపాటు పొలాలు మునిగిపోవడంతో ఆర్డీవో కీర్తి పరిశీలించారు. మండలంలోని 11 హెక్టార్లలో పంటనష్టం జరిగిందని ఏవో పూర్ణిమ తెలిపారు. పలు గ్రామాలను జిల్లా వ్యవసాయశాస్త్రవేత్త లక్ష్మణ ఆధ్వర్యంలో నీటమునిగిన,నేలకోరిగిన వరిపంటలను పరిశీలించారు.

●మెరకముడిదాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాతాడ, చినమంత్రిపేట, గర్భాం, బుదరాయవలస, బోడందొరవలసల్లో వరి పంట ముంపునకు గురైంది. బుధవారం గాలితో పాటు వర్షం కురవడంతో పలు గ్రామాల్లో వరిపంట నేలకు ఒరిగింది. మండలంలో 160 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లిందని ఏవో శ్రావణితేజ తెలిపారు. కాగా చెల్లాపురం-చినరవ్యాం తారురోడ్డు సర్వాగి షైన్స్ గనిబంటా సమీపంలో కోతకు గురికావడంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులుపడుతున్నారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రహదారిని పరిశీలించారు. మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకులు కోట్ల మోతీలాల్ నాయుడు యంత్రాలతో తాత్కా లికంగా రహదారి వేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సులోచనరాణి తదితరులు పాల్గొన్నారు.

●రాజాం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్యాంపురంలో నేలమట్టమైన వరి పంటను జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరిశీలించారు.ఆయన వెంట తలే రాజేష్, సూర్యనారాయణ, రాజగోపాల నాయుడు, నర్సింహులు, సర్పంచ్ చీడి రమేష్, నక్క వర్షిణి ఉన్నారు.

నీట మునిగిన పోలిపల్లి రహదారి

భోగాపురం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడ పంచాయతీ శ్రీరాంనగర్ కాలనీకి వెళ్లే రహదారి పూర్తిగా నీటితో నిండిపోవడంతో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతుబంగార్రాజు బుధవారం పరిశీలించారు.రెడ్డికంచేరు, దిబ్బలపాలెం గ్రామాల్లో రెండు గృహాలు కూలిపోయాయి. పోలిపల్లి నుంచి లింగాలవలస వెళ్లే బీటీ రహదారి పూర్తిగా నీటితో మునిగి పోయింది. గుడివాడ పంచాయతీ వెంబడి ఉన్న గోస్తనీ నది ప్రవహించడంతో శ్రీరాంనగర్ కాలనీలో కొన్ని గృహాలు నీటిలో మునిగిపోయాయి.గోస్తనీనది ప్రవాహం వల్ల రాకపోకలకు అంతరాయం కలిగింది.ఎరుసుపేటలో కూడాపలు గృహాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రాజాపులోవ సమీపంలో విజయనగరం వైపు నుంచి విశాఖ వైపు వెళ్లే ఎన్‌హెచ్-26 రహదారి నిండి పోవడంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి.

● వేపాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో తుఫాన్ వల్ల ముంపునకు గురైన ప్రాంతాలను మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ పరిశీలించారు. సింగరాయి గెడ్డ వరదనీటితో పొంగి పారుతుండడంతో సింగరాయి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.సోంపురం సమీపంలో రైల్వేలైన్‌లో నిర్మించిన రైల్వేఅండర్ బ్రిడ్జివద్ద తుఫాన్ వర్షపునీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కాగా 30 మంది మారిక గిరిజనులు 50 ఎకరాల్లో సాగుచేసిన వరి పంట దెబ్బతినడంతో ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ కోరారు.

గుర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పాలవలస, పీఆర్‌పేట గ్రామాల మధ్య చెట్లు విరిగి పడడంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అధికారుల చొరవ తీసుకొని వెంటనే తొలగించడంతో రాకపోకలు సజావుగా జరిగాయి. పాలవలసలో గేదెల అప్పలనాయుడుకు చెందిన రెండెకరాల బొప్పాయి పంట దెబ్బతింది.

నేలకొరిగిన సరుగుడు తోటలు

కొత్తవలస, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వియ్యంపేట, వీరభద్రపురం, కొట్టానివానాపాలెం చీడివలస, సుందరయ్యపేట, గొల్లలపాలెం,నరపాం, రామలింగపురం, దేవాడ, ముసిరాంలో సరుగుడు తోటలు నేలమట్టంకావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపుగా పెరుగుతున్న తోటలు వంగిపోయి విరిగిపోయాయి.

●పూసపాటిరేగ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):కోనాడ, తిప్పలవలస గ్రామాలను టీడీపీ నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా మత్స్యకారుల సమస్యలను మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డెంకాడ మాజీ జెడ్పీటీసీ కంది చంద్రశేఖర్, భోగాపురం టీడీపీ మండలాధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, నాయకులు పతివాడ అప్పలనారాయణ, ఆకిరి ప్రసాదరావు, మత్యకార నాయకులు దంగా భూలోక అడిగి తెలుసుకొన్నారు.కాగా మండలంలో ప్రాథమికంగా ఆరు ఎకరాలలో వరికి నష్టం జరిగినట్లు ఏవో నీలిమ తెలిపారు.

చెరువుల పరిశీలన

విజయనగరంరూరల్,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):నగరంలోని జమ్ము ప్రాంతంలోని పలు చెరువులను మొంథా తుఫాన్ వల్ల కురిసిన వర్షాల నేపథ్యంలో నగర టీడీపీ అధ్యక్షుడు గంటా రవి బుధవారం పరిశీలించారు. నగరంలోని పునరావాస కేంద్రాలను కూడా పరిశీలించారు. నగరంలోని తుఫాన్ నేపథ్యంలో ఉత్పన్నమైన పలు సమస్యలను కమిషనర్ పి.నల్లనయ్య దృష్టికి తీసుకువెళ్లారు.

తుఫాన్ బాధితులకు పరామర్శ

విజయనగరంలోని నల్లచెరువు ప్రాంతంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువు నుంచి బయటకు నీరుచేరింది. దీంతో నాలుగో డివిజన్ పరిధిలోగల ఆ ప్రాంతాన్ని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆదేశాల మేరకు టీడీపీ నగర నాయకులు ప్రసాదుల ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి పొగిరి పైడిరాజు బాధిత కుటుంబాలను పరామర్శిం చారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకూ పునరావాస కేంద్రంలో ఉండాలని వారి బాధిత కుటుంబ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఆ డివిజన్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●గంట్యాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రావివలసలోని వరి పొలాలను శాస్త్రవేత్తలు డాక్టరు తేజేశ్వరరావు, యాత్రివేణి, స్వాతిలు పరిశీలించారు. ఈ సందర్భంగా తుఫాన్ సమయంలో పంటలను రక్షించుకోవడం, పంటను నష్టాన్ని తగ్గించడంపై రైతులకు అవగాహన కల్పించారు.

● విజయనగరం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మండలంలో అక్టోబరు నెలలో అధిక వర్షపాతం నమోదైంది. మూడేళ్లతో పోల్చితే ఈ ఏడాది అక్టోబరులో రికార్డుస్థాయిలో వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం 197.1 మిల్లీమీటర్లు కాగా ఈనెల ఒకటి నుంచి 29వ తేదీ వరకూ విజయన గరంలో 362.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకూ లోటు వర్షపాతం నమోదైనా, అక్టోబరు నెలకు వచ్చే సరికి ఎక్కువ మిల్లీమీటర్ల వర్షం కురిసింది.


కొత్తవలస: రామలింగపురంలో నేలమట్టమైన సరుగుడు తోట

● విజయనగరం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పెద్ద చెరువు నిండికుండలా తొణికిసలాడుతోంది. చెరువు గట్టు వరకూ నీళ్ల రావడంతో నగరపాలక సంస్థ అధికారులు నీటిని బయటకు విడిచిపెట్టేస్తున్నారు. కాగా కలెక్టరేట్‌కు సమీపంలో గల రెడ్‌క్రాస్ సొసైటీకి ఆనుకుని ఉన్న రహదారిపై నీరుచేరడంతో రాకపోకలకు అగచాట్లకు గురవుతున్నారు.


సంతకవిటి: నారాయణపురం ఆనకట్ట వద్ద వరద ప్రవాహం

నాగావళిలో పెరిగిన నీటి ప్రవాహం

రేగిడి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టులు నిండడంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా నాగావళిలో నీటి ప్రవాహంపెరిగింది.సాయంత్రానికి తోటపల్లి ఆరువేలు క్యూసెక్కులు, మడ్డువలస ఐదుగేట్లు నుంచి 19 వేల క్యూసెక్కులు నాగావళిలో విడిచిపెట్టారు. దీంతో మండలంలో నాగావళి పరివాహకంలోని 12 లోతట్టు గ్రామాల్లో వరద భయం వెంటాడుతోంది. తహసీల్దార్ కృష్ణలత నదీ ప్రవాహాన్ని సిబ్బందితో పరిశీలించారు. మడ్డువలస, తోటపల్లి అధికారులతో ఆమె మాట్లాడారు. ప్రవాహం 30వేలు క్యూసెక్కులు దాటితే మొదటి ప్రమాద హెచ్చరిక ఉంటుందని, రాత్రికి నీటి ప్రవాహం తగ్గుతుందని తెలిపారు. కాగా మండలంలో ఆకులోవగెడ్డకు వరద ఉధృతికి ఆరుగ్రామాల్లో వరిపంట నీటిమునగ్గా, దాదాపు 31 రెవెన్యూ గ్రామాల్లో 300హెక్టార్లలో పంట నష్టంవాటిల్లినట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా గుర్తించింది. ఆకులోవగెడ్డకు వరద పోటెత్తడంతో అంబాడ, వెంకటాపురం, నాయిరాలవలస, చెలిగానవలసలో 200 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. సాయన్నబట్టి, గెడ్డబట్టిలతోపాటు ఖండ్యాం, పనసలవలస, కోడిశ, వావిలవలస, గుల్లపాడులో దాదాపు మరో 500 ఎకరాల వరకు నెలకొరిగి ముంపుబారినపడినట్లు ఏవో శ్రీనివాస్ తెలిపారు. వెంకమ్మపేట కాజ్‌వే వంతెనపై నుంచి నీరు రావడంతో అధికారులు రహదారిని బంద్ చేయించారు. దీంతో వెంకమ్మపేట రూట్లో ఉన్న ఆరుగ్రామాల రాకపోకలకు నిలిచిపోయాయి.

●సంతకవిటి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):ఎగువ నుంచి వరద నీరు రావడంతోపాటు, మడ్డువలస రిజర్వాయర్ నుంచి నీటిని దిగువకు విడిచిపెట్టడంతో రంగారాయిపురం వద్దగల నారాయణపురం ఆనకట్టలో జలకళ సంతరించుకుంది. కాగా మండలంలో దాదాపు 1000 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కాగా సిరిపురం వద్ద రెల్లిగెడ్డపై వరదనీటి ప్రవాహాన్ని టీడీపీ నాయకులు కొల్ల అప్పలనాయుడు,రాజాంవాణిజ్య విభాగం అధ్యక్షుడు వల్లూరు గణేష్, గట్టి భాను, మొయ్యి నారాయణప్పడు పరిశీలించారు.

చేపల వేట నిషేధం

వంగర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):మడ్డువలస, నాగావళి, వేగావతి నదుల్లో చేపలవేట మత్స్యకారులు చేయవద్దని, నిబంధలను అతిక్రమించి ఎవరు చేపలువేటకు దిగినా కేసులు నమోదు చేస్తామని సీఐ ఉపేంద్రరావు సూచించారు. బుధవారం మడ్డువలస రిజర్వాయర్ ప్రాంతంలో పలువురు మత్స్యకారులు చేపలవేటకు దిగడానికి ప్రయత్నించగా వారిని అడ్డుకున్నారు. తుఫాన్ దృష్ట్యా చేపల వేట పూర్తిగా నిషేధించినట్లు సీఐ తెలిపారు.కాగా మండలంలోని సీతారాంపురం, కొప్పర, బాగెమ్మపేట, కింజంగి రాజులగుమ్మడతో పాటు పలుగ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాగావళి వేగావతి, సువర్ణముఖి నదులు పొంగి గ్రామాల వైపు రావడంతో మరువాడ, కింజంగి, వీవీఆర్‌పేట, రాజులగుమ్మడ, శివ్వాం, సంగాం గ్రామాల్లో భూములు కోతకు గురైయ్యాయి.

ఉధృతంగా ప్రవహిస్తున్న తుమ్మలపేట గెడ్డ వాగు

నెల్లిమర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):చంద్రంపేట పంచాయతీ పరిధిలోని తుమ్మలపేట గెడ్డవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. తుమ్మలపేట సమీపంలో విజయనగరం-పారసాం రోడ్డుపై ఉన్న చప్టాపై నుంచి గెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలో గెడ్డకు ఆవలవైపు ఉన్న గ్రామాలప్రజల రాకపోకలు మంగళవారం రాత్రి నుంచి నిలిచిపోయాయి. పారసాం, చిన్న బూరాడపేట వద్ద బూరాడపేట గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్న టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ పార్టీ నాయకులతో కలిసి తుమ్మలపేట గెడ్డను పరిశీలించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కాజేవే మంజూరుకు కృషి చేస్తానని రవిశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, లెంక అప్పలనాయుడు, అవనాపు సత్యనారాయణ, పోతల రాజప్పన్న, గొలజాన నారాయణరావు పాల్గొన్నారు.


విజయనగరం టౌన్: జలకళలాడుతున్న పెద్దచెరువు

ఊపిరి పీల్చుకున్న జిల్లా యంత్రాంగం

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీవ్రత తగ్గడంతో అధికారయంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ప్రాణ, ఆస్తి నష్టం నివారణకు అధికార యంత్రాంగం చేసిన కృషి ఫలించింది. మంగళవారం అర్ధరాత్రి కలెక్టరు రామసుందర్‌రెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరిశీలించారు. కింద స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. జేసీ సేతుమాధవన్ డెంకాడలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూము తనిఖీ చేశారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా తేలిక పాటి వర్షం కురిసింది. మొత్తం జిల్లాలోని రెవెన్యూ, పోలీసు, విద్యుత్, వ్యవసాయ, పంచాయతీరాజ్, మునిసిపల్, వైద్య, విద్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మూడురోజులపాటు సుమారు జిల్లా వ్యాప్తంగా 116.1 మిల్లీమీటర్లు వర్షం కురిసింది.చెరువులు నిండ కుండల్లా మారాయి. జిల్లాలో గోస్తాని, చంపావతి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. తాటిపూడి, ఆంధ్ర, మడ్డువలస రిజర్వాయర్లలోకి వరద నీరు చేరడంతో ముందుగానే ఇరిగేషన్ అధికారులు కిందకు విడిచి పె ట్టారు.కాగా తుఫాన్ సమయంలో నిర్విరా మంగా కృషి చేసి ప్రాణనష్టం జరగకుం డా సేవలందించినందుకు సమయ స్ఫూర్తితో వ్యవహరించిన కలెక్టరు రామసుందర్‌రెడ్డిని సీఎం అభినందించారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం, ప్రజలకు తక్షణ సహాయం అందించేలా చర్యలు తీసు కోవడం తోపాటు సమష్టి కృషి వల్ల ఉత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా జిల్లా అధికారు లు, సచివాలయం సిబ్బంది పని చేశారని, వారి సేవలను అమోఘమని కలెక్టరు రామ సుందర్ రెడ్డి అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినుల డిశ్చార్జి

నెల్లిమర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి గుర్లలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు బుధవారం డిశ్చారయ్యారు. మంగళవారం రాత్రి గుర్ల కేజీబీవీలో షార్ట్ సర్క్యూట్ కావడంతో పరుపులు తగలబడి పొగ వ్యాపించి ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆ విద్యార్థినులను గుర్తైన నెల్లిమర్ల సీహెచ్‌సీకి తరలించారు. ఈమేరకు వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుకావడంతో వైద్యులు బుధవారం మధ్యాహ్నాం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కాగా విద్యార్థినులను ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు నెల్లిమర్ల పీహెచ్‌సీలో బుధవారం పరామర్శించారు. ఆయన వెంట ఆర్‌జేడీ విజయభాస్కర్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా రాష్ట విద్యామౌలిక వసతుల కార్పోరేషన్ డైరెక్టర్ చీకటి సుహాసిని ఆసుపత్రిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

● గుర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గుర్ల కస్తూర్బా పాఠశాలలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురి కాగా ఆస్పత్రిలో చేర్చారు.ఈ మేరకు బుధవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి రావడంతో వారిని పలువురు పరామర్శించి, వసతి గృహన్ని కూడా పరిశీలించారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

మెంటాడ,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కోరారు. బుధవారం స్థానిక కేజీబీవీని సందర్శించారు. ఈసందర్భంగా ఆవరణలో నీరు చేరడానికి కారణాలను ప్రిన్సిపాల్ శారదాదేవిను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు వస్తే పిల్లలను ఇళ్లకు పంపించాలని తెలిపారు. కొందరు అధికారుల సమన్వయ లోపం వల్ల కేజీబీవీ, ఆశ్రమపాఠశాల విద్యా ర్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో మోహనరావు, తహసీల్దార్ అరుణకుమారి, కృష్ణ పాల్గొన్నారు.

వైద్యకళాశాలలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

విజయనగరం దాసన్నపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, దోపిడీ విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు 17 ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్‌చేశారు. బుధవారం విజయనగరంలో సీపీఐ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వఆధీనంలో ఉండాల్సిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి కార్పొరేట్‌వర్గాలకు అప్పగిస్తున్న కూటమి ప్రభుత్వం తమ విధానాన్ని వెనక్కితీసుకోవాలని కోరారు.

అంతర్ వర్సిటీ కబడ్డీ పోటీలకు ఎంపిక

నెల్లిమర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన సోమాదుల భాను, తామాడ భవాని, మొయిద శ్రీవల్లి, పాండ్రంకి రమ్య గురువారం నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు చెన్నైలో జరగనున్న దక్షిణభారత అంతర వర్సిటీల మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ ఆంధ్రా వర్సిటీ జట్టు తరపున ఎంపికైనట్టు శిక్షకులు రామారావు తెలిపారు.ఈ మేరకు వీరిని నెల్లిమర్ల కబడ్డీ సంఘం అధ్యక్షుడు బోని సూర్యనారాయణనాయుడు, క్రీడాకారులు అభినందించారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం తూకం వేయాలి

చీపురుపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎంఎల్ఎస్ పాయింట్‌లో డిపోలకు తరలించాల్సిన బియ్యాన్ని ముందుగా తూకం వేసి ఇవ్వాలని మెరకముడిదాం మండలంలోని బుదరాయవలస డీలర్ బూర్లె వెంకటప్పలనాయుడు కోరారు. బుధవారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తూకం వేయకుండా బియ్యం ఇస్తున్నారని, దీంతో ప్రతి బస్తాలో కనీసం ఒకటి నుంచి రెండు కిలోలు తరుగుదల ఉంటోందని తెలిపారు. కాగా కాగా డీలర్ల కోరిక మేరకు తూకం వేసి ఇవ్వాల్సి ఉందని గోదాము ఇన్‌చార్జి సన్యాసినాయుడు తెలిపారు. ఇక ప్రతి బస్తాను ఎంఎల్ఎస్ పాయింట్‌లో తూకం వేసి ఇస్తామని, అయితే, ప్రస్తుతం తూనిక యంత్రం పాడయ్యిందని, దీంతో బయట ప్రైవేటు తూనిక యంత్రాల వద్ద తూకం వేసి, బియ్యాన్ని డిపోలకు తరలిస్తున్నామని వివరించారు.

పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలి

రాజాం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పాత డివిజన్ కేంద్రాన్ని జిల్లాగా ఏర్పాటు చేయాలని జిల్లా సాధన సమితి ప్రతినిధులు కోరారు.ఈ మేరకు బుధవారం రాజాం క్యాంపు కార్యాలయంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుకు సాధన సమితి గౌరవాధ్యక్షులు కనపాక చౌదరినాయుడు, అధ్యక్షుడు బుడితి అప్పనాయుడు, కోశాధికారి సబ్బ నానాజీ, రుంకు రామకృష్ణ, ఉపాధ్యాయ సంఘాల నాయుకులు నెల్లి సత్యంనాయుడు, విశ్రాంతి సైనికు ఉద్యోగ సంఘం అధ్యక్షుడు వెన్నపు వెంకటరమణ, యందవ రామకృష్ణ వినతిపత్రం అందజేశారు.

శానిటేషన్ ప్రక్రియ ప్రారంభించండి: కలెక్టర్

తెర్లాం, అక్టోబరు 29(అంధ్రజ్యోతి): గంగన్నపాడు గ్రామాన్ని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. గ్రామ సమీపంలోనున్న నర్సుపల్లి చెరువు పూర్తిగా నిండడంతో మిగులు నీరంతా గ్రామంలోకి ప్రవహించడాన్ని ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ ప్రవీణ్ కూమార్‌తో మాట్లాడి నీటి ప్రవాహం తగ్గేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అదేశించారు. గ్రామంలో వరద ప్రభావం తగ్గిన వెంటనే ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని, శానిటేషన్ ప్రక్రియ మొదలు పెట్టాలని అధికారులకు సూచించారు. కాగా తహసీల్దార్ హేమంత్‌కుమార్ పల్లపు ప్రాంతంలో ఉన్న నాలుగు కుటుంబాలను పునరావాస కేంద్రానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బేబీనాయన బుధవారం గ్రామంలో పర్యటించి అధికారులను మరింత అప్రమత్తం చేశారు. ఆర్డీవో రామ్మోహనరావు కూడా గ్రామాన్ని సందర్శించారు.


గంగన్నపాడులో పర్యటిస్తున్న కలెక్టర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బాడంగి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. ఈ నెల 25న డొంకినవలస గ్రామంలో అపస్మారక స్థితిలో ఓవ్యక్తి ఉండగా 108ద్వారా స్థానిక సీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. డొంకినవలస వీఆర్వో సింహాచలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతుడు హిందీభాషలో మాట్లాడాడని, నీలంరంగు టీషర్టు, నాచురంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీలో భద్రపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

గజపతినగరం,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):మండలంలోని లింగాలవలసలో పేకాట ఆడుతున్న పది మందిపై కేసునమెదు చేసినట్లు ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు బుధవారం తెలిపారు. గ్రామం శివారున చెరువు దగ్గర పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేయగా ఆరుగురు పట్టుబడినట్లు తెలిపారు వారి వద్ద నుంచి రూ.11,300 స్వాధీనంచేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. మరోచోట నలుగురు పట్టుబడినట్లు తెలిపారు వారివద్దనుంచి రూ. 10,060 స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన పది మందిపై కేసు నమెదుచేసినట్లు తెలిపారు.

మద్యం దుకాణాల తనిఖీ

వేపాడ,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి: ప్రతి మద్యం సీసాను సురక్ష మాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని కొత్తవలస ఎక్సైజ్ ఎస్ఐ వీఎస్ రాజు తెలిపారు. వేపాడ మండలంలోని మద్యం షాపులను బుధవారం తనిఖీచేశారు. వేపాడ,వల్లంపూడి, కృష్ణారాయుడుపేట, అంకాజోష్యులపాలెంల్లో బెల్టు షాపులు, సారా తయారీ కేంద్రాల్లో సోదాలు చేశారు.

గల్లంతైన విద్యార్థులు క్షేమం

గుర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):గడిగెడ్డ ప్రాజెక్టులో బుధవారం గల్లంతైన మెరకముడిదాం మండలం గర్భాం గ్రామానికి చెందిన విద్యార్థులు క్షేమంగా ఒడ్డుకు చేరారు. స్నానానికి దిగిన ఇద్దరు యువకులు దిగిన కొద్దిసేపటికి గల్లంతయ్యారు. చప్టాపై నుంచి కిందకు జరగడంతో చేపలు వేట కోసం దిగువన ఉన్న స్థానికులు ప్రమాదం గమనించి అప్రమత్తమై ఇద్దరిని రక్షించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో రవికుమార్, ఎస్ఐ పి.నారాయణరావు సంఘటనా స్థలానికి చేరుకొని గడిగెడ్డలో స్నానానికి దిగిన ఇద్దరి నుంచి వివరాలు సేకరించారు. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

భూములు తిరిగి ఇప్పించాలి

ఎస్.కోట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ భూములు వెనక్కి ఇప్పించాలని జిందాల్ నిర్వాసితులు కోరారు. బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు చేపట్టిన దీక్షలు బుధవారానికి 131వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిందాల్ పరిశ్రమకు 18 ఏళ్ల కిందట తాము అభివృద్ధి చెందుతామని నమ్మి భూములు ఇచ్చి రోడ్డున పడ్డామని వాపోయారు.

ముంచెత్తిన మొంథా!

(5వ పేజీ తరువాయి)

పత్తి పంటలు ముంపునకు గురయ్యాయని వ్యవసాయాధికారులు తెలిపారు. ●జియ్యమ్మవలస: మండలంలో 50 ఎకరాల్లో వరి, మరో 20 ఎకరాల్లో అరటి పంటలకు నష్టం వాటిల్లింది. వట్టిగెడ్డ రిజర్వాయర్ నుంచి ఎనిమిది క్యూసెక్కులను కిందకు విడిచిపెట్టారు. దిగువ ఏజెన్సీకి వెళ్లే ప్రధాన రహదారి కాజ్‌వే పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహించడంతో 30 గిరిజన గ్రామాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా రాళ్లగెడ్డపై కూడా ఉధృతంగా వరద ప్రవహించడంతో రహదారిపై వాహనాల రాకపోకలను నిషేధించారు.

● పాలకొండ: రావాడ గెడ్డ, తంపరగెడ్డ, జంపరకోటగెడ్డ, ఓనిగెడ్డలు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో పాలకొండ పరిధిలోని పది గ్రామాల్లో సుమారు 285 ఎకరాల్లో వరి పంట నీటి మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. స్వల్ప గాలులకు కొన్ని గ్రామాల్లో వరిచేలు నేల వాలింది. సంబంధిత అధికారులు పంటల నష్టాన్ని పరిశీలించి నివేదికలు రూపొందిస్తున్నారు. మరోవైపు నాగావళి వంతెన వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో అటువైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ● గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాలు వరద నుంచి ఇంకా తేరుకోలేదు. దత్తివలసతో పాటు కొంకడివరం, సీతారాంపురం, తదితర గ్రామాల్లో గాలులకు వరి పంట నేలకొరిగింది. కొన్నిచోట్ల పంట ముంపులో ఉండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏఎంసీలకు పూర్వ వైభవం వచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

అదనపు భవనం నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఇక సాలూరు ఏఎంసీలో గోడౌన్ మొక్కజొన్న రైతులకే ఉపయో గపడుతోంది. మిగతా రైతులకు ఉపయోగపడే పనులేవీ ఇక్కడ చేపట్టడం లేదు. ఇక పాలకొండలో ఉన్న మార్కెట్ యార్డు పరిస్థితి దారుణంగా ఉంది. ఇక్కడ రైతులకు ఉపయోగపడే విధంగా ఎటువంటి గోడౌన్ల నిర్మాణాలు చేపట్టలేదు. సెస్ వసూళ్లు, చెక్‌పోస్టుల వరకే ఏఎంసీ సిబ్బంది పరిమితమయ్యారు. రైతులకు ఎటువంటి సేవలు అందించడం లేదు. గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సదుపాయాలపై అవగాహన కల్పించడం లేదు. రైతుబంధు పథకం ద్వారా సున్నా వడ్డీతో రుణాలు అందించడం లేదు. మార్కెట్ కమిటీల ద్వారా భూసార పరీక్షలు కూడా చేపట్టడం లేదు. పాడి పశువులకు ఏడాదికి నాలుగుసార్లు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను అందించాల్సి ఉన్నా.. జిల్లాలో అదెక్కడా కానరావడం లేదు. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏఎంసీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కనీస అభివృద్ధికి నోచుకోలేదు. తాజాగా దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మార్కెట్ యార్డు చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు ఏఎంసీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని వారు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

భామినిలో పత్తి కొనుగోలుకు అవసరమైన గోడౌన్ ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. వీరఘట్టంలో మినీ రైతు బజారు ఏర్పాటుకు రూ.41 లక్షలు మంజూరయ్యాయి. దీనికి ఇంకా పరిపాలనా పరమైన ఆమోదం రాలేదు. ఇటీవల ముఖ్యమంత్రి ప్రకటించిన అంశాలపై ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు.

- సతీష్‌కుమార్, ఏఎంసీ సెక్రటరీ, పాలకొండ

ఘాట్ రోడ్డుపై పడిన కొండ చరియ

పాచిపెంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా రొడ్డవలస సమీపంలో గల ఘాట్ రోడ్డులో భారీ కొండ చరియ మంగళ వారం రాత్రి పడింది. విషయం తెలుసుకున్న అధికారులు బుధవారం ఉదయం ఎక్స్‌కవేటర్ సాయంతో కొండ చరియను తొలగించారు. సహాయక చర్యల్లో స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు లారీ బోల్తా

భామిని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పసుకుడి సమీపంలో మళ్లీ లారీ బోల్తా పడింది. బుధవారం వేకువజామున విశాఖ నుంచి ఛత్తీస్‌గఢ్ వెళుతున్న బొగ్గు లారీ పసుకుడి దాటాక మలుపు వద్ద గోతులను తప్పించబోయి పొలాల్లో బోల్తా కొట్టింది. ఈ నెల రోజుల్లో మూడుసార్లు ఇదే ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లారీలు బోల్తా పడ్డాయి.

నదులు, వాగుల వద్ద పహారా

సాలూరు రూరల్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగకూడదనే ధ్యేయంగా మండలంలోని నదులు, వాగుల వద్ద ఎంపీడీవో పార్వతి, తహసీల్దార్ నీలకంఠరావుల మండల టీమ్ పహారా ఏర్పాట్లు చేసింది. సుల్లరి వద్ద కల్లం గెడ్డ, దళాయివలస గెడ్డ, దండిగాం కాజ్‌వే, దిగువమెండంగి కాజ్‌వే, శివరాం పురం కాజ్‌వే, పారన్నవలస వేగావతిప్రాంతంలో బృందాలను నియమించారు.

ఉపాధ్యాయులను వేధించడం మానుకోండి

గరుగుబిల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులను వేధించడం మానుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మర్రాపు మహేష్, బాలకృష్ణ అధికారులను కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరును ఆలస్యంగా నమోదు చేస్తున్నారన్న దానిపై జిల్లా విద్యాశాఖాధికారి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారన్నారు. దీనిపై స్పందిస్తూ సంబంధిత మండలాల ఎంఈవోలు హాజరు నమోదు చేసిన సిబ్బందిని సంజాయిషీ అడగడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆఫ్‌లైన్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

వీరఘట్టం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ఆ శాఖ అధికారులు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారు. వీరఘట్టంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తుఫాన్ కారణంగా మరమ్మతుకు గురైన వెంటనే ఏఈ సోమేశ్వరరావు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు.

చురుగ్గా విద్యుత్ స్తంభాల మార్పు

●పార్వతీపురం రూరల్: తుఫాన్ ప్రభావంలో లక్ష్మీనారాయణపురంలో విద్యుత్ స్తంభాన్ని ఏపీ ట్రాన్స్‌కో సిబ్బంది యుద్ధప్రాతిపదిక మార్చారు. విద్యుత్ స్తంభం వాలడంతో వెంటనే విద్యుత్ శాఖకు గ్రామ కార్యదర్శి అమీష్, వీఆర్‌వో పురుషోత్తపురం సమాచారం అందించడంతో విద్యుత్ శాఖ సిబ్బందితో స్తంభాన్ని మార్చారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం (బలిజిపేట), అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట మండలానికి ఇరువైపులా నదులు ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ బాల మురళీకృష్ణ, ఎంపీడీవో శ్రీవాణి సూచించారు. సువర్ణముఖిలో నీటి ఉధృతి పెరిగిన నేపథ్యంలో మురగడం, చాకరాపల్లి, నారాయణపురం గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. మరోవైపు వంతరాం బస్టాండ్, నూకలవాడలో వరద నీరు చేరడంతో వారిని అప్రమత్తం చేశారు.

ఉధృతంగా జంఝావతి ప్రవాహం

కొమరాడ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు జంఝావతి నది ఉధృత్తంగా ప్రవహిస్తోంది. రబ్బర్ డ్యామ్ వద్ద నీటిని నదిలో విడిచిపెట్టడంతో ప్రవాహం పెరిగింది. కళ్లికోట, పూర్ణపాడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సి.హెచ్.సత్యనారాయణ, ఎస్ఐ కె.నీలకంఠం కోరారు.

పంట నష్టాల పరిశీలన



నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి

మక్కువ రూరల్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ రామచంద్రరావు పరిశీలించారు. బుధవారం ఆయన మార్కొండపుట్టి, చెముడు గ్రామాలను సందర్శించారు. నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. చెముడు గ్రామంలో నేలకొరిగి నీటిలో మునిగిన పొలాలను సందర్శించారు. రైతుకు నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చింతల భారతికి సూచించారు. .అనంతరం ఆయన మార్కొండపుటిలో పత్తి, వరి పొలాల ను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో ఎస్.అర్జునరావు, మండల ఇంజనీరింగ్ అధికారి రజిత్‌కుమార్, ఏపీవో ఈశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు

●గరుగుబిల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావుపల్లి దేసూరిగెడ్డ ముంపు సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్టు మన్యం డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం రావుపల్లిలోని దేసూరిగెడ్డను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంతాడ మహేష్ సమస్యను డిప్యూటీ కలెక్టర్‌కు వివరించారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొంతమేర వరి పంట ముంపునకు గురైందని తహసీల్దార్ పి.బాల, ఎంపీడీవో జి.పైడితల్లి, వ్యవసాయాధికారిణి టి.జ్యోత్స్న వివరించారు. నష్టం వాటిల్లకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. పరిశీలనలో ఆర్ఐ శ్రీనివాసరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బోను శివకుమార్, టీడీపీ నాయకుడు ఎస్.సింహాచలం, క్షేత్ర సహాయకులు ఎం.శంకరరావు ఉన్నారు.



రావుపల్లిలో దేసూరిగెడ్డను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్

కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందనలు



ఎస్పీ మాధవరెడ్డితో కానిస్టేబుల్ మధుబాల

బెలగాం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్, యోగా విభాగంలో పాల్గొని కాంస్య పతకం సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ మధుబాలను ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మధుబాల మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఎస్పీ సత్కరించారు.

ఖైదీల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి



పుస్తకాలు అందజేస్తున్న హరిబాబు

పాలకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖైదీల ఆరోగ్యంపై సబ్ జైలు సిబ్బంది శ్రద్ధ వహించాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.హరిబాబు సూచించారు. సబ్ జైలును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలు పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఖైదీల్లో ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం ఖైదీలకు క్యారం బోర్డు, చెస్, మానసిక పరివర్తన కలిగించే పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, హెడ్ వార్డర్ జి.రమణయ్య, బి.విజయ్‌కుమార్ ఉన్నారు.

పాఠశాల ప్రాంగణంలోకి వరదనీరు



పాఠశాల ఆవరణలో చేరిన వరదనీరు

వీరఘట్టం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): తుఫన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నడుకూరు ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలోకి వరదనీరు పెద్దఎత్తున చేరింది. పాఠశాలకు సెలవు కావడంతో విద్యార్థులకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. పాఠశాలకు చేరువన గల మురుగు కాలువ సరిగా లేకపోవడంతో వరద నీరు పాఠశాలలోకి చొరబడుతోందని గ్రామస్థులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడంలేదని వారంటున్నారు.

ఖజానా కార్యాలయ ఆవరణలో..

●సాలూరు, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయం ఆవరణలో వరద నీరు నిలిచింది. దీంతో ఖజానా శాఖ ఉద్యోగులు, వివిధ పనులపై కార్యాల యానికి వచ్చేవారు ఇబ్బంది పడ్డారు. కార్యాలయం ఎదుట నీరు నిల్వ సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరారు. ఇదిలా ఉండగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిన్న వీధిలోని సింగారపు మోహన్ ఇంటి గోడ బుధవారం ఉదయం కూలింది. ఎవరికీ ఎలాంటి ఏ ప్రమాదం జరగలేదు. మున్సిపల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మట్టి, ఇటుకలను డంపింగ్‌యార్డుకు తరలించారు.

గణేశ్‌నగర్ కాలనీకి తుఫాన్ కష్టం



వరదనీటిలో నడుస్తున్న కాలనీవాసులు

పార్వతీపురం టౌన్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల కురుస్తున్న వర్షాలకు పట్టణ వాసులను భయభ్రాంతులకు గురయ్యారు. బుధవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో పట్టణంలోని సౌందర్య థియేటర్ రోడ్డు వీధితో పాటు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గణేశ్‌నగర్ కాలనీలోని రోడ్లపై వరదనీరు నిలిచింది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. అలాగే పట్టణం మీదుగా ప్రవహిస్తున్న వరహలగెడ్డ వరదనీరు బైపాస్ కాలనీలోకి చేరింది. దాంతో మున్సిపల్ ప్రజారోగ్యశాఖ అధికారులు యుద్ధపాతిపదికన నీరు మళ్లింపునకు చర్యలు చేపట్టారు.

సహాయక చర్యలు ముమ్మరం

గరుగుబిల్లి, అక్టోబరు29 (ఆంధ్రజ్యో): రావివలస ప్రజలకు అసౌకర్యం కలగకుండా సచివాలయ కార్యదర్శి ఆర్.శశిభూషణరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బుధవారం గ్రామంలోని పలు వీధుల్లో నిలిచిన మురుగు నీటిని ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు మళ్లించే చర్యలు చేపట్టారు. గ్రామ సమీపంలోని ప్రధాన రహదారికి ఆనుకుని గతంలో ఏర్పాటు చేసిన అక్విడెక్టుతో పాటు రక్షణ గోడ నాగావళి పిల్ల కాలువ వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. అక్విడెక్టు ప్రమాదంపై సమాచారాన్ని ఎంపీడీవో జి.పైడితల్లి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన వారిని నియమించి రోగాల బారిన పడకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు తెలిపారు.

భారీ వర్షానికి దెబ్బతిన్న ఇళ్లు



పొయిమాలలో కూలిన ఇల్లు

సాలూరు రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో రెండిళ్లు కూలాయి. 130 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. కొదమ పంచాయతీ పొయిమాలలో సీదరపు చంద్రి ఇంటి గోడ వర్షాలకు కూలింది. అలాగే కొఠియా గ్రూప్ గ్రామం పగులు చెన్నారులో కూనేటి హరికి చెందిన పెంకుటిల్లు గోడ కూలింది. ఈ వర్షాలకు రెండిళ్లకు నష్టం వాటిల్లినట్టు ఆయా వీఆర్వోలు నివేదికలు అందజేశారని సాలూరు తహసీల్దార్ నీలకంఠరావు తెలిపారు. తుఫాన్ వల్ల మండలంలో 130 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. మామిడిపల్లి, పెదపథంలో పంట నష్టాలను మండల ప్రత్యేక అధికారి బి.రామారావు, ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి, తహసీల్దార్ నీలకంఠరావు పరిశీలించారు.

గుమ్మలక్ష్మీపురంలో మూడిళ్లు..

●గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మూడు ఇళ్లు కూలినట్టు తహసీల్దార్ శేఖరం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గొయ్యిపాక, దాదుపురం, వాడజంగి గ్రామాల్లో ఇళ్లు కూలాయన్నారు. సుమారు 12 ఎక రాల్లో వరి పంటకు నష్టం జరిగిందన్నారు.

సీతంపేటలో రెండు రేకుల ఇళ్లు..

●సీతంపేట రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): లాడ గ్రామంలో గిరిజనులకు చెందిన రెండు రేకుల ఇళ్లులు తుఫాన్‌కు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. బుధవారం వేకువజామున కురిసిన భారీ వర్షానికి సవర లక్కాయి, ఆరిక రమేష్‌లకు చెందిన ఇంటిపై ఉన్న రేకులు, గోడ నేలకూలాయి. మండల ప్రత్యేక అధికారి గణేష్, తహసీల్దార్ శ్రీకన్య.. లాడ గ్రామాన్ని సందర్శించి ఇళ్లను పరిశీలించారు.

పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

గరుగుబిల్లి, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ముంపునకు గురైన వరి పంటను బుధవారం అధికారులు పరిశీలించారు. పెద్దూరు, గరుగుబిల్లి, రావుపల్లి, ఉద్దవోలు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ దుర్గ, ఎస్.స్రవంతి, అమృత వీణ, అనంత విహారితో పాటు పలువురు వర్షాలకు నష్టం కలిగిన వరి పంటను నిశితంగా పరిశీలించారు. పంట సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిశీలనలో సిబ్బంది సత్యనారాయణ, అనూష, మణికృష్ణతో పాటు పలువురు రైతులు ఉన్నారు.

●వీరఘట్టం: పనసనందివాడలో తుఫాన్ కారణంగా నేలకొరిగిన వరి పంటను బుధవారం కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ధ్రువ, డాక్టర్ స్రవంతి, జి.అమృత వీణ, విహారి తదితరులు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసా అధికారి సౌజన్య, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

●సీతానగరం: వరి కంకుల నుంచి ధాన్యం రాలిపోకుండా ముందు జాగ్రత్త చర్యలు రైతులు తీసుకోవాలని కేవీకే శాస్త్రవేత్తల బృందం ధ్రువ, అమృతవీణ, స్రవంతి విహారి సూచించారు. వివిధ గ్రామాల్లో పండిన వరి చేను, కోసిన వరి చేనును ఏవో ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో బుధవారం వారు పరిశీలించారు.

పాలకొండను జిల్లా చేయండి

●మంత్రి సంధ్యారాణికి సాధన సమితి వినతిపత్రం



వినతిపత్రం అందజేస్తున్న సమితి ప్రతినిధులు

సాలూరు, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): పాలకొండ జిల్లాల పునర్విభజన నేపథ్యంలో పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను జిల్లాగా చేయాలని లేదా పాలకొండను శ్రీకాకుళం జిల్లాలో కలపాలని జిల్లా సాధన సమితి ప్రతినిధులు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరారు. బుధవారం సాలూరు క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా జిల్లాల విభజన చేసిందన్నారు. దానిపై 2020 నుంచి రాజకీయాలకు అతీంగా జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తున్నామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సాధన సమతి గౌరవ అధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు, అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు, కోశాధికారి సబ్బ నానాజీ, రుంకు రామకృష్ణ, విశ్రాంత వైనిక ఉద్యోగుల సంఘం పాలకొండ ఉపాధ్యక్షుడు వెన్నపు వెంకటరమణ, నాయకులు నెల్లి సత్యంనాయుడు, యందవ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

సాలూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వేగావతి నదికి ఎగువన ఉన్న పెద్దగెడ్డ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేయడంతో ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లోకి బురదనీరు చేరడం వల్ల తాగునటి సరఫరాను నిలుపుదల చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. హెడ్ వాటర్ వర్క్స్‌కు స్వచ్ఛమైన నీరు రాకపోవడంతో గురువారం పట్టణ ప్రజలకు నీటి సరఫరా చేయలేమని వివరించారు.

సహజ సిద్ధంగా పార్కును తీర్చిదిద్దండి



పార్కును పరిశీలిస్తున్న జేసీ

గరుగుబిల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఉద్యాన వనాన్ని సహజ సిద్ధంగా తీర్చిదిద్దాలని జేసీ, ఇన్‌చార్జి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో తోటపల్లి ఉద్యానవనాన్ని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. పార్కు అభివృద్ధితో పాటు పర్యాటకులను ఆకర్షించేలా పార్కును తీర్చిదిద్దాలని, ప్రకృతి సిద్ధమైన వాతావరణం మధ్య వెదురుతో చేసిన వస్తువులు, గిరిజన సంస్కృతిని ప్రతిబింబించేలా కళాకృతులను ఏర్పాటు చేయాలని పలు సూచనలు ఇచ్చారు. పర్యటనలో ఏపీవో ఎ.మురళీధర్, జల వనరులశాఖ డీఈఈ రఘునాథ్‌నాయుడు పాల్గొన్నారు.

నిందితుడిని అరెస్టు చేయండి

భామిని, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): సొలికిరిలో బర్ల ఆనంద్‌పై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఐ జి.అప్పారావుకు వినతిపత్రం అందించారు. ఘటన జరిగిన మూడు రోజులు అయినప్పటికీ నిందితుడిని అదుపులోకి తీసుకోక పోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐను కలిసిన వారిలో బి.రవి నాయుడు, కొండలరావు, రామారావు ఉన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

● ప్రమాదం నుంచి బయటపడిన సిబ్బంది

గరుగుబిల్లి, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న సమయంలో పెద్ద శబ్దంతో ఫ్యాన్లు పేలడంతో తహసీల్దార్ పి.బాల, ఉప తహసీల్దార్ మర్రాపు రాజేంద్ర, ఏఎస్‌వో ఉమామహేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయినట్టు గుర్తించారు. ప్రమాదం నుంచి బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దాంతో చీకటిలోనే అధికారులు విధులు నిర్వహించారు.